క్లుప్తంగా

హామీల అమలులో ప్రభుత్వం విఫలం

హుజూరాబాద్: యూరియా కోసం రైతులు అరిగోస పడుతున్నా ప్రభుత్వం స్పందించక పోవడం దురదృష్టకరమని ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ అన్నారు. సోమవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన హామీల అమలులో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. అవసరమైన యూరియా బస్తాలను కూడా సరఫరా చెయ్యలేని స్థితిలో ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎరువుల కొరత లేదని గుర్తు చేశారు. సమావేశంలో నాయకులు కొండాల్ రెడ్డి, శ్యామ్ సుందర్‌రెడ్డి, డాక్టర్ ఐలయ్య, రవీందర్‌రావు, కటుకూరి మల్లా రెడ్డి, ప్రతాప్ రెడ్డి, నరెడ్ల దయాకర్‌రెడ్డి, దాసరి రమణారెడ్డి, పోతిరెడ్డి పేట శ్రీనివాస్, జైహింద్ రెడ్డి పాల్గొన్నారు.

సరిపడా యూరియా సరాఫరా చేయాలి

శంకరపట్నం: యూరియా సరాఫరాలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు గీట్ల ముకుందరెడ్డి ఆరోపించారు. శంకరపట్నం మండలం సీపీఎం కార్యవర్గ సమావేశం కేశవపట్నంలో నిర్వహించారు. సమావేశానికి హాజరై మాట్లాడారు. సబ్సిడీలను తగ్గించేందుకు నానో యూరియా వాడాలని కేంద్రం చెబుతుందని విమర్శించారు. రాష్ట్రాలకు రావాల్సిన యూరియా అందించాలని డిమాండ్ చేశారు. పంటలపై ప్రభావం పడకుండా వెంటనే యూరియా సరాఫరా చేయాలన్నారు. సమావేశంలో మండల కార్యదర్శి రాజిరెడ్డి, దుర్గప్రసాద్, చక్రపాణి, వెంకటేశ్ తదితరులు ఉన్నారు.

దిష్టిబొమ్మ దహనం

చిగురుమామిడి: కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సరిపడా యూరియా సరఫరా చేయకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆరోపిస్తూ మండల కేంద్రంలో సోమవారం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. పీఎం మోదీ దిష్టిబొమ్మ దహనం చేశారు.

సన్మానం



సన్మానిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

రామడుగు: రామడుగు ఎంఈవోగా సోమవారం బాధ్యతలు స్వీకరించిన రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల హెచ్‌ఎం జీవీవీ రంగనాథ్‌శర్మను ఎంపీడీవో రాజేశ్వరీ, మండలంలోని ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, మాజీ సర్పంచ్ పంజాల జగన్మోహన్‌గౌడ్ పలువురు ఘనంగా సన్మానించారు.

విద్యార్థులకు పోటీలు



బహుమతి ప్రదానం చేస్తున్న హెచ్‌ఎం

హుజూరాబాద్: పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులకు గంగిశెట్టి మధురమ్మ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం చేతిరాతపై పోటీలు నిర్వహించారు. పోటీల్లో 8 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొన్నారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు ట్రస్ట్ నిర్వాహకుడు గంగిశెట్టి జగదీశ్వర్‌తో కలిసి హెచ్‌ఎం శోభారాణి బహుమతు ప్రదానం చేశారు.

కాలేజీల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలి

హుజూరాబాద్: ఎమ్మెల్యే సొంత నిధులతో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో మధ్యాహ్న భోజనం అమలు చేయాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రామారపు వెంకటేశ్ కోరారు. సోమవారం పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి ఈటల రాజేందర్ సొంత ఖర్చుతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి వీణవంక, హుజూ రాబాద్, జమ్మికుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మధ్యాహ్న భోజనం సొంత ఖర్చుతో ఏర్పాటు చేయాలని కోరారు. సమావేశంలో నాయకులు రాము యాదవ్, రోహిత్, శివాకేశవరెడ్డి, గణేశ్, రామారపు నాని, పిల్లి బన్ని పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

జమ్మికుంట: మున్సిపల్ పరిధి అబాది జమ్మికుంట 13వ వార్డులోని హిందూ శ్మశాన వాటిక వద్ద ప్రజా శివసేన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు బోళ్ల స్వామి ఆధ్వర్యంలో పలువురు సోమవారం నిరసన తెలిపారు. శ్మశాన వాటిక నిర్మాణానికి పలుమార్లు నిధులు కేటాయించినా పనులు అసంపూర్తిగా చేశారని ఆరోపించారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని కలెక్టర్ స్పందించి అధికారులు, పనులు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నేదురి రాము, పిట్టల సదానందం, కొమ్ము రాములు, కైలాసకోటి భిక్షపతి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

పనిభారం తగ్గించాలని ధర్నా



చెల్పూర్ పీహెచ్‌సీ ఎదుట ధర్నా చేస్తున్న ఏఎన్‌ఎంలు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని చెల్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎదుట ఏఎన్‌ఎంలు సోమవారం ధర్నా నిర్వహించారు. పనిభారం, అనవసరపు టార్గెట్‌తో ఒత్తిడి చేస్తున్నారని, ప్రజలకు ఆరోగ్య సేవలందించాల్సిన తమపై పాలన, సాంకేతికపరమైన పనిభారం మోపుతున్నారన్నారు. 32 రకాల మొబైల్ యాప్‌లలో డేటా నమోదుతో పనిభారం మరింత పెరిగిందని వాపోయారు. ప్రభుత్వం వెంటనే పనిభారం తగ్గించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నాలో ఏఎన్‌ఎంలు సరోజన, వజ్ర, కరుణ, శోభ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపాధ్యాయుడే మార్గదర్శి

ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

గంగాధర: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు ఉపాధ్యాయుడే మార్గదర్శకుడని, ఉత్తములుగా తీర్చిదిద్దడంలో కీలక పాత్ర పోషిస్తారని ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని మధురానగర్ మైనారిటీ గురుకుల విద్యాలయంలో మండలస్థాయి ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిని సోమవారం ఘనంగా సన్మానించారు. రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని, ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాల కల్పనకు నిధులు కేటాయిస్తుందన్నారు. నాణ్యమైన విద్యను అందించడానికి సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని, ఉపాధ్యాయులు చిత్తశుద్ధితో పనిచేస్తూ విద్యార్థులను ఉత్తములుగా తీర్చిదిద్దాలని సూచించారు. మండల విద్యాధికారి ప్రభాకర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతులకు అండగా నిలుస్తాం

నియోజకవర్గంలోని పంటపొలాలకు సాగునీరందించి రైతులకు అండగా నిలుస్తామని ఎమ్మెల్యే అన్నారు. మధురానగర్ ప్రజాభవన్‌లో మాట్లాడారు. ఎల్లంపల్లి నీటిని నారాయణపూర్ రిజర్వాయర్‌కు తరలించి చెరువులు, కుంటలు నింపుతామని, సాగునీరు అందుతుందో లేదోనని రైతులు ఆందోళన చెందవద్దన్నారు.



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే సత్యం



హెచ్‌ఎం శారదను సన్మానిస్తున్న నాయకులు

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని శాలపల్లి-ఇందిరానగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం పప్పుల శారదను సోమవారం పలువురు నాయకులు ఘనంగా సన్మానించారు. పద్మశాలీ గ్రామ అధ్యక్షుడు వేముల రమేశ్, బీసీ ఆజాదీ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, సదాశివ, సత్యం, నగేశ్, శ్రీనివాస్, అంజయ్య, సుధాకర్, మాజీ ఎంపీటీసీ లలిత, తదితరులు పాల్గొన్నారు.

చిగురుమామిడి: మండల కేంద్రంలోని రైతు వేదికలో ఉపాధ్యాయ దినోత్సవం పురస్కరించుకొని ఎంఈవో పావని అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో మండలంలోని ప్రభుత్వ పాఠశాల్లో ఉత్తమ బోధన చేసిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. మండల పరిషత్ అభివృద్ధి అధికారి మధుసూదన్ మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమ పౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఆయా ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సీఆర్పీలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



చిగురుమామిడి: ఉత్తమ ఉపాధ్యాయులతో ఎంపీడీవో మధుసూదన్, ఎంఈవో పావని, తదితరులు

క్రీడల్లో రాణించాలి



కబడ్డీ ఆడుతున్న బాలికలు

జమ్మికుంట: పట్టణంలోని బాలుర పాఠశాల మైదానంలో మండల స్థాయి ఎస్‌జీఎఫ్ క్రీడలు సోమవారం ప్రారంభమయ్యాయి. అండర్ 14, 17 బాలికల కబడ్డీ, ఖోఖో పోటీలు నిర్వహించారు. గెలుపొందిన జట్లను జిల్లా స్థాయికి ఎంపిక చేశామన్నారు. జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ వేణుగోపాల్ మాట్లాడుతూ... విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలన్నారు. కార్యక్రమంలో ఎంఈవో హేమలత, మండల ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శ్రీలత, పీడీలు శ్రీనివాస్, ప్రేమలత, రేణుక, అఫ్స, ఉమ పీఈటీలు, తదితరులు పాల్గొన్నారు.

మండల స్థాయి పోటీలు



పోటీలు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు

మానకొండూర్: అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం పురస్కరించుకొని మండలంలోని ఉన్నత పాఠశాలలు, కేజీబీవీ, మోడల్, ఎంజీపీ స్కూళ్లు, సోషల్ వెల్ఫేర్ విద్యార్థులకు మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. పోస్టర్ డ్రాయింగ్, నినాదాలు రాయడం, వ్యాసరచనలో పోటీలు నిర్వహించారు. పోస్టర్ డ్రాయింగ్‌లో అన్నారంకు చెందిన యశస్విని, నినాదాల్లో ఎంజీపీ విద్యార్థిని బి.కీర్తన, వ్యాసరచన పోటీల్లో మానకొండూర్ బాలికల హైస్కూల్ విద్యార్థిని ఆర్. హర్షిత విజేతలుగా నిలిచారు. విద్యార్థినులు జిల్లా స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని ఉపాధ్యాయులు తెలిపారు.



చిగురుమామిడి: సంజీవ్‌కు నియామక పత్రం అందిస్తున్న మహేందర్

ముదిరాజ్ హక్కుల సాధన విజయవంతం చేయాలి

హుజూరాబాద్‌రూరల్: జిల్లా కేంద్రంలో 10న నిర్వహించే ముదిరాజ్ హక్కుల సాధన కార్యక్రమాన్ని మండలంలోని ముదిరాజ్‌లు విజయవంతం చేయాలని మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల జిల్లా ఉపాధ్యక్షుడు పెసరుకుమారస్వామి, జిల్లా డైరెక్టర్ గొడుగు సమ్మయ్య కోరారు. సోమవారం మండలంలోని ధర్మరాజుపల్లి గ్రామంలో కార్యక్రమ పోస్టర్ ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ ముదిరాజ్ హక్కుల సాధన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకులు నీలం మధు ముదిరాజ్ హాజరు కానున్నారని తెలిపారు. అనంతరం మండల కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా నిమ్మ తిరుపతి, ఉపాధ్యక్షుడిగా గట్టు సదానందం, కార్యదర్శిగా రెడ్డబోయిన రాజు ఎన్నికయ్యారు.

ముదిరాజ్‌లకు దామాషా ప్రకారం టికెట్లు కేటాయించాలి

చిగురుమామిడి: ముదిరాజ్‌లకు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో దామాషా ప్రకారం ఆయా రాజకీయపార్టీలు టికెట్లు కేటాయించాలని ముదిరాజ్ పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు కూన మహేందర్ కోరారు. సోమవారం మండలంలోని చిన్నములకనూర్ పెద్దమ్మతల్లి ఆలయంలో సమావేశం నిర్వహించారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన ముదిరాజ్‌లు పాల్గొన్నారు. అత్యధిక స్థానాలు గెలుపొంది ముదిరాజ్‌ల సత్తా చాటాలన్నారు. ఈసందర్భంగా ముదిరాజ్ చిగురుమామిడి మండల అధ్యక్షుడిగా చెరుకు సంజీవ్‌ను నియమించారు. అనంతరం 10న కరీంనగర్‌లోని పద్మనాయక కళ్యాణ మండపంలో నిర్వహించే ముదిరాజ్ ఆత్మీయ సమ్మేళనం పోస్టర్ ఆవిష్కరించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి సంపత్, జిల్లా ఉపాధ్యక్షుడు రాజేశం, జిల్లా అధికార ప్రతినిధి పిల్లి రవీందర్, హుస్నాబాద్ నియోజకవర్గ ఇంచార్జి రమేశ్, మండల, గ్రామస్థాయి నాయకులు పాల్గొన్నారు.



ధర్మరాజుపల్లిలో నూతన సంఘం నాయకులు

పైపులైన్ లీకేజీతో రోడ్డు బురదమయం



గన్నేరువరం: గన్నేరువరంలోని గుట్టపై పైపులైన్ లీకేజీతో నీరు వృథాగా పోతుందోంది. చొక్కారావుపల్లె పంపుహౌజ్ నుంచి గుట్ట మీదుగా గన్నేరువరం వచ్చే పైపులైన్‌కు లీకేజీ ఏర్పడింది. నీరు చేనులోకి వస్తోందని ఓ రైతు వేరే ప్రదేశానికి నీటిని తరలించేందుకు జేసీబీతో కాల్వ ఏర్పాటు చేసే క్రమంలో లీకేజీ మరింత ఎక్కువైంది. దీంతో గుట్టపై నుంచి కిందనున్న గన్నేరువరం-కరీంనగర్ ప్రధాన రోడ్డు పైకి నీరు చేరుతోందని. రహదారి బురదమయంగా తయారవుతోందని ప్రయాణికులు, వాహనదారులు వాపోతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి లీకేజీని అరికట్టాలని కోరుతున్నారు.

ముగిసిన ఎస్జీఎఫ్ కబడ్డీ క్రీడోత్సవాలు



కరీంనగర్‌స్పోర్ట్స్: పాఠశాలల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో మానేరు విద్యాసంస్థల సౌజన్యంతో రెండురోజులుగా పద్మనగర్‌లోని మానేరు సీబీఎస్ఈ స్కూల్‌లో జరిగిన ఎస్జీఎఫ్ కబడ్డీ క్రీడోత్సవాలు సోమవారం ముగిశాయి. అండర్- 14,17 బాలబాలికలకు పోటీలకు సుమారు 2,000 మందికి పైగా క్రీడాకారులు హాజరయ్యారు. బహుమతి ప్రదానోత్సవానికి మానేరు విద్యాసంస్థల అధినేత అనంతరెడ్డి, ఒలింపిక్ సంఘం ప్రధాన కార్యదర్శి జనార్దన్‌రెడ్డి, తెలంగాణ కబడ్డీ సంఘం ఉపాధ్యక్షుడు సీహెచ్ సంపత్‌రావు హాజరై ట్రోఫీ, పతకాలు అందజేశారు.

టెక్నాలజీతో బోధన సులభతరం చేయాలి



కరీంనగర్‌క్రైం: శాతవాహన యూనివర్సిటీ, సెంటర్ ఫర్ రీసెర్చ్ ఇన్ స్కీమ్స్ అండ్ పాలసీస్ ఆధ్వర్యంలో సోమవారం వాగేశ్వరీ, పీజీ కళాశాలలో 'ఈ-రిసోర్సెస్ అండ్ డిజిటల్ లైబ్రరీస్ ఫర్ టీచింగ్ అండ్ లెర్నింగ్' అంశంపై జాతీయ వర్క్‌షాప్ జరిగింది. శాతవాహన వీసీ ప్రొఫెసర్ ఉమేశ్‌కుమార్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సాంకేతికతను ఉపయోగించి నూతన తరానికి బోధన, అభ్యాస ప్రక్రియను మరింత సులభతరం చేయాలని సూచించారు.



సాక్షి



హుజూరాబాద్‌రూరల్: జమ్మికుంట-హుజూరాబాద్ ప్రధాన రోడ్డు పక్కన మండలంలోని శాలపల్లి గ్రామ ఆర్టీసీ బస్టాండ్ ముళ్లపొదలు, పిచ్చిమొక్కలతో నిండిపోయి అస్తవ్యస్తంగా తయారైందని ఆగస్టు 30న 'సాక్షి'లో వాట్సాప్ కథనం ప్రచురితమైంది. సంబంధిత అధికారులు కథనానికి స్పందించి సోమవారం బస్టాండ్‌ను బాగు చేయించారు. దీంతో ప్రయాణికులు, స్థానికులు హర్షం చేశారు.

సాక్షి స్పందన

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది.

మా ఫోన్ నంబర్లు: 9393557752, 9848408781, 8790144227

'జ్యోతిష్మతి'లో ఇంటరాక్టివ్ ఇన్‌సైట్స్



హాజరైన విద్యార్థులు, అధ్యాపకులు (ఇన్‌సెట్లో) మాట్లాడుతున్న గోపాల్

తిమ్మాపూర్: మండల కేంద్రంలోని జ్యోతిష్మతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ సైన్స్ అటానమస్ కళాశాలలో సోమవారం ×ఇంటరాక్టివ్ ఇన్‌సైట్స్.. ప్రిపేరింగ్ ఫర్ టుమారోస్ చాలెంజెస్¤ ఆలోచనాత్మక సెషన్ కళాశాల ఎంటర్‌ప్రెన్యూర్ అండ్ డెవలప్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కృష్ణ ఇంజినీరింగ్ కన్సల్టెంట్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు, అమెరికా అయోవా స్టేట్ గోపాల్ టీకే.కృష్ణ సహకారంతో సెషన్ నిర్వహించామని కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు తెలిపారు. గోపాల్ టీకే. కృష్ణ మాట్లాడుతూ.. ప్రతీ విద్యార్థి చదువుతోపాటు ఇతర విషయాలపై ఎదిగేలాగా కష్టపడాలని తల్లిదండ్రులు, ఊరు, రాష్ట్రం, దేశానికి పేరు తేవాలని ఆకాంక్షించారు. మారుతున్న సాంకేతికతతో దేశాన్ని మొదటి స్థానంలో ఉంచాలని సూచించారు. అమెరికాలో మూడు మాస్టర్ డిగ్రీలు పొందానని, అక్కడ యూనివర్సిటీలకు నగదు వితరణ చేశానని, తాను చదువుకున్న ఊరిలో కొత్త భవనం నిర్మించడానికి ఉస్మానియా యూనివర్సిటీకి రూ.ఐదు కోట్లు ఇచ్చానని, ఇంకా రూ.పది కోట్లు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. కళాశాల చైర్మన్ జువ్వాడి సాగర్‌రావు మాట్లాడుతూ ఉద్యోగార్థులకు కార్యక్రమం దిక్సూచి అని ఆశాభావం వ్యక్తం చేశారు. గోపాల్ ప్రపంచ ధోరణి, ఆవిష్కరణలు, నాయకత్వ నైపుణ్యాలపై విలువైన సూచనలు అందించారని, విద్యార్థులు భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొనేందుకు క్రిటికల్ థింకింగ్, సమస్య పరిష్కార నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. కళాశాల సెక్రెటరీ జే. సుమిత్‌సాయి మాట్లాడుతూ.. విద్యార్థులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టి. అనిల్‌కుమార్, డీన్ పీకే.వైశాలి, విభాగాధిపతులు పాల్గొన్నారు.

● **లింగ వివక్ష చూపొద్దు**

మానకొండూర్: పుట్టబోయే బిడ్డపై లింగ వివక్ష చూపొద్దని ఆడ, మగ సమానమని ఎంసీహెచ్ పీవో సనాజువేరియా అన్నారు. మానకొండూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సోమవారం బేటి బచావో, బేటి బడావో కార్యక్రమంలో భాగంగా మట్లాడారు. గర్భిణులు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకుంటూ పండంటి బిడ్డకు జన్మనివ్వాలని, భ్రూణహత్యలు నేరమని, బేటి బచావో బేటి పడావో నినాదానం కచ్చితంగా పాటించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ సల్మాన్, సీహెచ్‌వో రాజునాయక్, హెల్త్ సూపర్ వైజర్ రాజు నాయక్, స్నేహలత, ఎం. సరోజ పాల్గొన్నారు.

● **సంఘాలు ఏర్పాటు చేయాలి**

మానకొండూర్: మహిళా సంఘాల్లో వికలాంగులు, వృద్ధులతో నూతన సంఘాలను ఏర్పాటు చేయాలని అడిషనల్ డీఆర్డీవో రవికుమార్ సోమవారం సూచించారు. మండల కేంద్రంలోని స్త్రీశక్తి భవనంలో నిర్వహించిన మండల సమైఖ్య సమావేశంలో మాట్లాడారు. వృద్ధాప్య, వికలాంగుల, కిశోర బాలికల గ్రూపులు ఏర్పాటు చేసి వారి ఆర్థిక అభివృద్ధికి కృషి చేయాలన్నారు. గ్రూపుల సమష్టి కృషితో సంఘంతో పాటు సభ్యులు ఆర్థికంగా స్థిరపడతారని, బ్యాంకులోన్లు తీసుకొని సక్రమంగా కట్టుకుంటే తక్కువ వడ్డీ పడుతుందన్నారు. ఓపెన్ టెన్త్, ఇంటర్ ప్రవేశానికి 20 పరీక్ష ఉంటుందని తెలిపారు. సంఘాల అభివృద్ధికి సభ్యులు కృషి చేయాలన్నారు. డీపీఎం తిరుపతి, ఏపీఎం బార్గవ్, రాజేందర్, సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

● **కేశవపట్నం పీహెచ్‌సీ తనిఖీ**

శంకరపట్నం: కేశవపట్నం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సోమవారం జిల్లా ప్రోగ్రాం అధికారి ఉమాశ్రీ తనిఖీ చేశారు. సీజనల్ వ్యాధులు, డెంగీ, బీపీ, షుగర్‌కు సంబంధించి వివిధ రికార్డులను పరిశీలించారు. ల్యాబ్‌లో జరుగుతున్న టెస్ట్‌లను పరిశీలించారు. ఓపీ, ల్యాబ్ పరీక్షలకు సంబంధించి రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేసి వైద్య సేవలపై వైద్యాధికారి శ్రావణ్‌కుమార్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. తనిఖీలో డిప్యూటీ డీఎంఅండ్ హెచ్‌వో చందు, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ అధికారి విమలాదేవి ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● **వైద్యశిబిరం**

హుజూరాబాద్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లా సమగ్ర శిక్షణ ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగ విద్యార్థులకు ప్రత్యేక వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి హుజూరాబాద్, జమ్మికుంట, ఇల్లందకుంట, సైదాపూర్, శంకరపట్నం మండలాలకు చెందిన 94 మంది దివ్యాంగులు హాజరు కాగా వైద్య సిబ్బంది వివిధ పరీక్షలు చేశారు. కార్యక్రమంలో జిల్లా సమగ్ర శిక్షణ ఐఈ కోఆర్డినేటర్ ఆంజనేయులు, ఎంఈవో భూపతి శ్రీనివాస్, సీఆర్పీలు తదితరులు ఉన్నారు.

● **భర్త ఇంటి ముందు భార్య బైఠాయింపు**

మానకొండూర్: భర్త కాపురానికి తీసుకెళ్లడం లేదని ఓ వివాహిత సోమవారం తన భర్త ఇంటి ముందే బైఠాయించింది. పెగడపల్లి గ్రామానికి చెందిన మమతకు మానకొండూర్‌కు చెందిన సీతాల రమేశ్‌తో 2020లో వివాహమైంది. భర్త కరీంనగర్ మున్సిపాలిటీలో కాంట్రాక్టు ఉద్యోగిగా పనిచేస్తున్నాడని, ఏడాది క్రితం పెద్దపల్లికి ట్రాన్స్‌ఫర్ కాగా తల్లిగారింటి వద్ద వదిలి వెళ్లాడని ఆరోపించింది. పోలీసులు ఎంత నచ్చజెప్పినా న్యాయం జరిగే వరకూ భర్త ఇంటి ముందే ఉంటానని పేర్కొంది.

● **మోటార్లు, వైర్లు చోరీ**

గంగాధర: మండలంలోని వ్యవసాయబావులు, కాలువల వద్ద తరుచూ విద్యుత్ మోటార్లు, వైర్లు చోరీకి గురవుతున్నాయి. లక్ష్మీదేవిపల్లి గ్రామంలో ఆదివారం రాత్రి దాదాపు 15 మంది రైతులకు చెందిన వ్యవసాయబావుల వద్ద స్టార్టర్ నుంచి బావిలోని మోటార్ వద్దకు ఉన్న విద్యుత్ వైరును దొంగిలించారు. పదిహేను రోజుల క్రితం సైతం దాదాపుముప్పై వ్యవసాయ బావుల నుంచి వైర్లు కోసుకెళ్లారని, ఎనిమిది నెలల క్రితం డిస్ట్రిబ్యూటరీ కాలువల వద్ద ఏర్పాటు చేసిన నాలుగు కరెంటు మోటార్లు దొంగిలించారని ఒక్కోదాని విలువ రూ.ముప్పైవేలు ఉంటుందని, పోలీసులకు ఫిర్యాదు చేసినా పోయిన మోటార్లు దొరకలేదని, చోరీ ఆగడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాపర్‌వైరు కోసం దొంగలు వైర్లు చోరీ చేస్తున్నారని, మళ్లీ కొనుగోలు చేయాలంటే రూ. రెండువేల వరకు ఖర్చు అవుతుందని రైతులు వాపోతున్నారు.

● **కేసు నమోదు**

జమ్మికుంట: మినీ డీసీఎం వ్యాన్‌తో ఢీకొట్టిన వ్యక్తిపై సోమవారం కేసు నమోదు చేశామని జమ్మికుంట పోలీసులు తెలిపారు. మున్సిపల్ పరిధి ధర్మారం గ్రామానికి చెందిన పోలు రాజు ఈ నెల 5న ఉదయం వాకింగ్ చేస్తుండగా హనుమకొండ జిల్లా ముల్కనూర్‌కు చెందిన బోల్లంవేని భార్గవ్ వాహనం అజాగ్రత్తగా నడుపుతూ వెనుక నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో తీవ్రగాయాలపాలైన బాధితుడి భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేశామని వివరించారు.

ఆసుపత్రి ధ్వంసం చేసిన వ్యక్తిపై..

పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిని ధ్వంసం చేసిన ఓ వ్యక్తిపై కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు. ఆదిత్య మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిలో మండలంలోని జగ్గయ్యపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చేతికి గాయం కాగా చికిత్స చేస్తుండగా అతని తమ్ముడు చికిత్సలో జాప్యం చేస్తున్నారని ఆరోపిస్తూ ఈసీజీ మిషన్, ఫర్నీచర్, ఇతర సామగ్రి ధ్వంసం చేయడంతోపాటు డ్యూటీ డాక్టర్‌ను బూతులు తిట్టి బెదిరింపులకు పాల్పడ్డాడని, ఆసుపత్రి మేనేజర్ ఎల్క దేవేందర్‌రెడ్డి ఫిర్యాదుతో కేసు నమోదు చేశామన్నారు.

● **రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు**

శంకరపట్నం: మండలంలోని తాడికల్ శివారులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. కరీంనగర్‌కు చెందిన నలుగురు యువకులు రెండు బైక్‌లపై వరంగల్ వెళ్తుండగా తరుణ్, అరవింద్ బైక్ తాడికల్ వద్ద అదుపు తప్పడంతో తరుణ్ కింద పడిపోయాడు. స్నేహితులు 108లో కరీంనగర్ ఆస్పత్రికి తరలించారు.

● **అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి**

రామడుగు: మండలంలోని గుండి మాజీ సర్పంచ్ రావుల రాజయ్య అనారోగ్యంతో సోమవారం మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. 1981 నుంచి 87 వరకు సర్పంచ్‌గా బాధ్యతలు నిర్వహించాడని, రాజయ్య మృతిపట్ల గ్రామస్తులు, పలువురు ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

ముందస్తు అరెస్టు

సాక్షినెట్‌వర్క్: చొప్పదండి, హుజూరాబాద్, మానకొండూర్, హుస్నాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాల ముట్టడి, ధర్నా నిర్వహిస్తారనే సమాచారంతో పోలీసులు ముందస్తుగా మాల మహానాడు నాయకులను అదుపులోకి తీసుకొని పోలీసు స్టేషన్లకు తరలించారు. ఎస్సీ వర్గీకరణలో భాగంగా మాల, అనుబంధ కులాలకు తీవ్ర అన్యాయం జరుగుతోందని, ప్రభుత్వం జారీ చేసిన జీవో 99ను సవరించి రోస్టర్ పాయింట్లను 22 నుంచి 16కు తగ్గించాలని డిమాండ్ చేశారు. మాలలకు అన్యాయం చేస్తున్నారని ఆరోపిస్తూ ఎమ్మెల్యే కార్యాలయాల ముట్టడికి యత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వర్గీకరణ సరిగా చేయలేదని, మాలల ఓట్లతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందన్నారు. సుప్రీం కోర్టు మార్గదర్శకాలను తుంగలో తొక్కి ఒక వర్గం ఓట్ల కోసం శాస్త్రీయ లెక్కలు లేకుండా విద్యా, ఉద్యోగ రంగాల్లో మాలలకు తీవ్ర అన్యాయం జరిగేలా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు.